క్లుప్తంగా

అమ్మవార్లకు విశేష పూజలు



విశేష అలంకరణలో ముత్యాలమ్మవారు

జంగారెడ్డిగూడెం: స్థానిక నూకాలమ్మ, ముత్యాలమ్మ ఆలయాల్లో కార్తీక శుక్రవారం సందర్భంగా అమ్మవార్లకు విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. అమ్మవారి రజత వస్త్రం ఏర్పాటుకు జంగారెడ్డిగూడెం పూర్వపు ఆర్డీఓ వైవీ ప్రసన్న లక్ష్మి, విఘ్నేశ్వరుడు దంపతులు 25 తులాల వెండిని అందజేశారని ఆలయ చైర్మన్ రాజాన సత్యనారాయణ తెలిపారు. ముత్యాలమ్మ వారికి (మూల విరాట్‌కి) 22 రకాల రకాల హారతులిచ్చామని ఆలయ ప్రధానార్చకుడు కె.విజయ శర్మ తెలిపారు.

బాలికల రక్షణకు కృషి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ వాణి

లింగపాలెం: కౌమార బాలికల రక్షణకు కృషి చేయాలని ఎంపీడీఓ కె.వాణి అన్నారు. స్థానిక ఎంపీడీఓ శుక్రవారం నిర్వహించిన కిశోరి బాలిక వికాస్ కార్యక్రమానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. కౌమార దశలో ఉన్న బాలికలకు ఆత్మరక్షణ, యోగ వంటి అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098, ఉమెన్ హెల్ప్ లైన్ నెంబర్ 181 గ్రామాల్లో ప్రతి ఒక్కరికి తెలియాలని సూచించారు. పోక్సో చట్టం, విద్యా ఆరోగ్యంపై మాట్లాడారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. జిల్లా స్థాయిలో శిక్షణ పొందిన శిక్షకులు జి.రామలక్ష్మి, కె.మాధవి, విజయ, ఏఎన్ఎంకే పద్మజా కుమారి, అంగన్‌వాడి సూపర్‌వైజర్ ఎం.కుమారి, అంగన్‌వాడి సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా మట్టి అక్రమ తరలింపు



రాజు చెరువు నుంచి తలిస్తున్న మట్టి

కొయ్యలగూడెం: మండలంలోని పలు గ్రామాల పరిధిలో ఉన్న సాగునీటి చెరువుల నుంచి అక్రమార్కులు రాత్రి వేళల్లో యథేచ్ఛగా మట్టిని తరలించేస్తున్నారు. పరింపూడిలోని రాజు ట్యాంకు చెరువు నుంచి రాత్రి వేళల్లో జేసీబీల సాయంతో ట్రాక్టర్ ట్రక్కుల్లో మట్టిని తరలించకపోతున్నారు. భీముని చెరువు, ఉక్కుంపేట చెరువుల్లో మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. చెరువుల్లో నీరు తగ్గుముఖం పట్టడంతో మట్టి తరలింపునకు అక్రమార్కులకు వీలు కలిగింది. మట్టి వాహనాలు మితిమీరిన వేగంతో రాకపోకలు సాగిస్తుండడంతో స్థానికులు తీవ్ర భయాందోళన వ్యక్తం చస్తున్నారు. సంబంధిత శాఖాధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పంటలను గిట్టుబాటు ధరకు కొనాలి

కుక్కునూరు: పంటలను గతంలో కంటే అధిక ధరకు కొనుగోలు చేయాలని శుక్రవారం సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఆధ్వర్యంలో స్థానిక వ్యాపారులతో కుక్కునూరు చర్చ్ హాస్టల్‌లో చర్చలు నిర్వహించారు. క్వింటాలు ప్రత్తికి రూ.6,600, ధాన్యం ఎ-గ్రేడ్ రూ.2200, బి-గ్రేడ్ రూ.1950, మినుములు రూ.8 వేలకు కొనుగోలు చేసే విధంగా వ్యాపారులు అంగీకరించారని ప్రజాపంథా నాయకులు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సిరికొండ రామారావు, సోయం చంద్రావు, షేక్ మున్ని, మాచెర్ల వెంకటేశ్వర్లు, పెంకే వీరబాబు, కె.దుర్గాప్రసాద్, పట్ల బాబురావు, సరిహద్దు వెంకటేశ్వర్లు, వ్యాపారులు పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం



దాత రాజామణికి విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ నటరాజారావు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఇద్దరు భక్తులు వేర్వేరుగా శుక్రవారం రూ.2 లక్షలు విరాళంగా అందజేశారు. ఏలూరుకు చెందిన కోతి రాజామణి రూ.1,00,000, హైదరాబాద్‌కు చెందిన వకుళాభరణం సిరిపురపు నరసింహ కణ్ణన్ రూ.1,00,000 ఆలయ కార్యాలయంలో జమచేశారు. దాతలకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు విరాళం బాండ్ పత్రాలను అందించి, స్వామివారి ప్రత్యేక దర్శన సౌకర్యాన్ని కల్పించారు.

మూడు నెలలుగా సా...గుతున్న పనులు

- నత్తనడకన చింతలపూడి - నామవరం రోడ్డు నిర్మాణం
- గోతులు, గండ్లతో ప్రయాణికులకు అవస్థలు



నామవరం సమీపంలో గోతులు పడి అధ్వానంగా ఉన్న రోడ్డు



బోయిగూడెం సమీపంలో నిర్మించిన కల్వర్టు

చింతలపూడి : నామవరం, పట్టాయగూడెం రోడ్డు నిర్మాణ పనులు మూడు నెలలుగా సా..గుతున్నాయి. శంకుస్థాపన నాటి నుంచీ రోడ్డు మరమ్మతులు చేస్తునే ఉన్నారు. అసలు రోడ్డు పనులు ఎప్పుడు ప్రారంభిస్తారో.. నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందోనని ప్రజలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా దశాబ్దాల కాలంగా నామవరం వెళ్లే రహదారి అభివృద్ధికి నోచుకోలేదు. రోడ్డుపై గోతులు ఏర్పడి, రాళ్లపైకి లేచిపోవడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో ప్రయాణం నరకప్రాయంగా మారింది.

మూడో సారి శంకుస్థాపన!

2014లో పడిన వర్షాలకు చింతలపూడి నుంచి నామవరం, పట్టాయిగూడెం మీదుగా సీతానగరం వెళ్లే రోడ్డు తీవ్రంగా దెబ్బతింది. పలుచోట్ల గండ్లు కూడా ఏర్పడ్డాయి. గండ్లు పూడ్చినా ఆర్టీసీ బస్సు సర్వీసులు తిప్పడంలేదు. దీంతో 10 గ్రామాల ప్రజలు, విద్యార్థులు ప్రైవేటు వాహనాల్లో రాకపోకలు సాగించాల్సి వస్తోంది. రోడ్డుపై కంకర రాళ్లు లేచిపోయి నడిచి వెళ్లేందుకు కూడా అనుకూలంగా లేకపోవడంతో 2018లో నాటి సీఎం చంద్రబాబు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కాని రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. ఇటీవల సార్వత్రిక ఎన్నికలకు ముందు వైఎస్సార్ సీపీ హయాంలో నాబార్డు నుంచి సుమారు రూ.20 కోట్లు రుణం మంజూరు చేశారు. దీంతో రోడ్డు నిర్మాణానికి మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు శంకుస్థాపన చేశారు. పనులు ప్రారంభించేలోపే ఎన్నికల కోడ్డు అమలు కావడంతో నిర్మాణం పెండింగ్‌లో పడింది. ఇక ముచ్చటగా మూడోసారి టీడీపీ నాయకులు ఈ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని, ఏలూరు, సత్తుపల్లి ఆర్టీసీ బస్సులు ఈ గ్రామాల మీదుగా నడిచేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

రాకపోకలకు అవస్థలు



రోడ్డు అధ్వానంగా ఉండటంతో దశాబ్దాల కాలంగా రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. బయటి గ్రామాలకు వెళ్లాలంటే తీవ్ర అవస్థలు పడుతున్నాం. రోడ్డు నిర్మాణం పనులు వేగవంతానికి అధికారులు చర్యలు చేపట్టాలి.

– యర్రంశెట్టి రామకృష్ణారావు, మాజీ సర్పంచ్, నామవరం

బస్సు సర్వీసులు నడపాలి



రోడ్డు అధ్వానంగా ఉండటంతో రెండున్నర దశాబ్దాలుగా ఆర్టీసీ బస్సులు తిరగడం లేదు. గ్రామంలోని విద్యార్థులు, గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే రోడ్డు నిర్మాణం పూర్తి చేసి రవాణా సౌకర్యాలు మెరుగు పరచాలి.

– కొప్పుల నాగేశ్వరరావు, చింతలపూడి

జగనన్నను కలిసిన డీజే రాజు



జగనన్నతో డీజే రాజు

ద్వారకాతిరుమల: మండలంలోని దొరసానిపాడుకు చెందిన వైఎస్సార్ సీపీ నేత డీజే రాజు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. జగనన్న తనను ఆప్యాయంగా పలకరించి, భరోసా కల్పించారని రాజు తెలిపారు. ఎన్ని కష్టాలు ఎదురైనా జగనన్న వెంటే నడుస్తామని అన్నారు.

బాస్కెట్‌బాల్ పోటీలకు జిల్లా క్రీడాకారులు

ఏలూరు రూరల్ : పశ్చిమబెంగాల్ రాష్ట్ర కోల్‌కత్తాలో జరిగే 39వ జాతీయ యూత్ బాస్కెట్‌బాల్ పోటీల్లో ఈశ్వర్‌తేజ, కిషోర్‌కుమార్, సోమశేఖర్‌లు పాల్గొంటున్నారని జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఓ ప్రకటనలో తెలిపారు.

వీరేశ్వరునికి లక్షపత్రి పూజ



వీరేశ్వరస్వామి



బైనేరు వద్ద శివలింగం



కన్నాపురంలో రసలింగేశ్వర స్వామి

పోలవరం రూరల్: పోలవరం మండలం పట్టిసం శివక్షేత్రంలో కార్తీకమాసం, మాస శివరాత్రి కావడంతో భద్రకాళీసమేత వీరేశ్వరస్వామికి లక్షపత్రిపూజ చేశారు. ఆఖరి శుక్రవారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు శివక్షేత్రానికి చేరుకుని స్వామి వారిని దర్శించుకున్నారు. శివక్షేత్రం శివనామస్మరణతో మార్మోగింది. మహిళలు ధ్వజస్తంభం వద్ద కార్తీక దీపాలను వెలిగించారు. ఆలయ మండపంలో సామూహిక పూజలు చేశారు. భక్తులకు అన్నసమారాధన ఏర్పాటుచేశారు.

శివునికి ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం: బైనేరు శివాలయం శుక్రవారం విశేష పూజలు చేశారు. ఉమా సహిత రామలింగేశ్వరస్వామికి అర్చనలు, అభిషేకాధికాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు.

రసలింగేశ్వరునికి అన్నాభిషేకం

కొయ్యలగూడెం: కార్తీకమాసం సందర్భంగా కన్నాపురంలోని దుర్గాభవాని రసలింగేశ్వర స్వామి వారికి శుక్రవారం అన్నాభిషేకం చేశారు. అన్నాభిషేకం ద్వారా గ్రామం సుభిక్షంగా ఉండటంతో పాటు పాడిపంటలు సమృద్ధితో వెలుగుందుతాయని ఆలయ ప్రధాన అర్చకుడు మణికంఠ శర్మ తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అన్నాభిషేకంలోని ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు.

ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న అజయ్‌కుమార్

జంగారెడ్డిగూడెం: ఉద్యోగుల పదవీ విరమణ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని సీఐటీయూ రాష్ట ఉపాధ్యక్షుడు పి.అజయ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పీఏసీఎస్‌లో నిర్వహించిన ఏపీస్టేట్ అగ్రికల్చర్ కోఆపరేటివ్ సొసైటీస్ ఎంప్లాయీస్ యూనియన్ సమావేశంలో అజయ్‌కుమార్ మాట్లాడారు. పీఏసీఎస్ ఉద్యోగులకు పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచడంతోపాటు గ్రాట్యుటీ యాక్ట్ ప్రకారం ఇవ్వాలని కోరారు. సహకార సంఘ ఉద్యోగులకు జీఓ 36 ప్రకారం జీతాలు ఇవ్వాలన్నారు. డీసీసీబీలో 25 శాతం కోటా ఉద్యోగాలు అమలు చేయాలని, సంఘాలకు రావాల్సిన కమిషన్ వెంటనే అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట నాయకులు కె.సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ, ఉపాధ్యక్షులు వై.సర్వేశ్వరరావు, జంగారెడ్డిగూడెం ఏరియా సీఐటీయూ నాయకులు పీజే నారాయణ, కె.గంగరాజు, ఆర్ లక్ష్మి, బోడా ఆనంద్, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, కామవరపుకోట, ద్వారకాతిరుమల, చింతలపూడి, బుట్టాయగూడెం, పోలవరం ఏరియా కార్యదర్శులు పాల్గొన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం



బెల్లపు ఊట ధ్వంసం చేస్తున్న అధికారులు

బుట్టాయగూడెం: మండలంలోని బుద్దులవారిగూడెం, కొల్లాయిగూడెం గ్రామాల్లోని సారా స్థావరాలపై పోలవరం ఎక్సైజ్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. సారా తయారీకి ఉపయోగించే 14 డ్రమ్ముల్లో ఉన్న 2,800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ఈఎస్‌టీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఆర్ సత్యవతి తెలిపారు. సారా తయారు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ వైవీఎస్ఎస్ ఫణికుమార్, సిబ్బంది, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎల్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

జీలుగుమిల్లి మండలం దర్భగూడెంలో ఒక మహిళ నుంచి సుంకం చెల్లించని 25 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు తెలిపారు. దాడుల్లో ఎస్సై జి.వెంకటలక్ష్మి, ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరి అరెస్ట్, మద్యం స్వాధీనం

చింతలపూడి : నాగిరెడ్డిగూడెం గ్రామంలో ఎక్సైజ్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. నాగిరెడ్డిగూడెంకు చెందిన ఒక మహిళను అరెస్ట్ చేసి, రెండు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపారు. లింగపాలెం మండలం బాదరాల గ్రామంలో కాగితపు శంకరరావు అనే వ్యక్తి నుంచి ఆరు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని చెప్పారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు ఆర్‌వీఎల్ నరసింహారావు, అబ్దుల్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

మోదుగ విస్తర్లు కనుమరుగు

ప్లాస్టిక్, రెడీమేడ్ విస్తర్ల రాకతో తగ్గిన ఆదరణ



పేపర్ విస్తర్లు



తయారు చేసిన మోదుగు విస్తర్లు (ఫైల్)

బుట్టాయగూడెం: భోజనం వడ్డించేందుకు పరిచే ఆకు విస్తరాకు. రకరకాల ఆకులను ఉపయోగించి విస్తరాకులను తయారు చేస్తాం. పశ్చిమ మన్యంలోని ప్రజలు అత్యధికంగా మోదుగాకులను ఉపయోగిస్తారు. మోదుగాకును ఏ జంతువు ముట్టదు. అందుకే ఎంగిలి అవ్వని ఆకు కాబట్టే దీనికి అంత ప్రాధాన్యత ఉంది. ఎంత పెరిగినా మోదుగు చెట్టు కొమ్మకు మూడే ఆకులు ఉంటాయి. సహపంక్తిలో విస్తరు వేసి భోజనం పెడితే సుష్టిగా తింటాం. వివాహాది శుభకార్యాలు, ఇంట్లో ప్రత్యేక కార్యక్రమాలు జరిగినప్పుడే విస్తర్ల విలువ తెలుస్తుంది. అయితే రోజురోజుకూ పెరుగుతోన్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా సర్వసాధారణంగా ఉపయోగించే విస్తర్ల వినియోగం తగ్గింది. నాటి కాలంలో భోజనం చేయడానికి విస్తర్లు విరివిగా వినియోగించేవారు. వాటిని తయారు చేయడానికి మోదుగాకులను ఎండబెట్టి జొన్న, చీపురు పుల్లలతో వాటిని కుట్టి విస్తర్లుగా తయారు చేసి వినియోగించేవారు. అరిటాకులను కూడా భోజనం వడ్డించేందుకు వినియోగించేవారు. శుభకార్యాల సమయంలో అతిథులకు విస్తర, అరిటాకుల్లో సాంప్రదాయబద్ధంగా భోజనాలు వడ్డించేవారు. నేటికీ ఆ సాంప్రదాయం ఉన్నా, చాలామంది విస్తర్ల వాడకాన్ని తగ్గించేశారు.

అందుబాటులో ప్లాస్టిక్ విస్తర్లు

రోజురోజుకూ పెరుగుతోన్న సాంకేతిక పరిజ్ఞానం సాంప్రదాయబద్ధమైన వస్తువులను మింగేస్తోంది. వీటిలో విస్తరాకు ఒకటి. నేడు మార్కెట్‌లో ప్లాస్టిక్ బ్యాగ్‌లు, థర్మాకోల్ ప్లేట్లు, పేపర్ గ్లాసులు విరివిగా లభిస్తున్నాయి. ప్లాస్టిక్ విస్తర్లు తక్కువ ధరలకే లభించడంతో మోదుగాకు విస్తర్లను కొనేవారి సంఖ్య తగ్గిపోయింది. ప్రస్తుతం మోదుగు పూజలకు మాత్రమే వినియోగిస్తున్నారు.

మోదుగాకుల కొరత



ప్రస్తుతం అటవీ ప్రాంతంలో మోదుగాకుల కొరత ఏర్పడింది. కష్టపడి ఆకులు సేకరించి విస్తరాకులు తయారు చేసినా ప్లాస్టిక్, రెడీమేడ్ విస్తర్లు అందుబాటులోకి రావడంతో వీటిని వినియోగించేవారు కానరావడంలేదు. మారుమూల గిరిజన గ్రామాల్లో సైతం రెడీమేడ్ విస్తర్లనే వినియోగిస్తున్నారు.

– వెట్టి పెంటమ్మ, గిరిజన మహిళ, అంతర్వేదిగూడెం, బుట్టాయగూడెం మండలం

తగ్గిన ఉపాధి



నాడు మోదుగాకు సేకరించి శుభకార్యాల సమయంలో మేమే కుట్టుకునే వాళ్లం. శుభకార్యాలకు మోదుగాకు విస్తర్లనే వినియోగించేవారు. ఇప్పుడు ప్లాస్టిక్, పేపర్ విస్తర్లు అందుబాటులోకి రావడంతో మోదుగు విస్తర్లకు ఆదరణ తగ్గింది. దీంతో ఏజెన్సీలో చాలామందికి ఉపాధి కూడా తగ్గింది.

– నడపల ముక్కారెడ్డి, కొండరెడ్డి గిరిజనుడు, చింతపల్లి పోలవరం మండలం

సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

కొయ్యలగూడెం: గంగన్నగూడెం కేంద్రంగా విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని రైతులు కోరారు. గవరవరం సబ్ డివిజన్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదికలో రైతులు తమ సమస్యలపై వినతులు అందజేశారు. ఏఈ ఎస్వీ రామారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ చైర్మన్ బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు ఎస్సార్ మసిలమనీ, ఆర్థిక సభ్యులు షేక్ బాబర్ తదితరులు పాల్గొన్నారు. యర్రంపేట శివారు గ్రామాల్లో లో వోల్టేజీతో మోటార్లు చెడిపోతున్నయని, చేతికొచ్చే దశలో ఉన్న పంటను కాపాడాలని రైతులు అన్నారు. గత ప్రభుత్వంలో మంజూరైన సబ్‌స్టేషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. గత ఆరు నెలలుగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వివరించారు. గ్రామాల్లోని విద్యుత్ సమస్యలతో పాటు వ్యక్తిగత సమస్యలపైనా పలువురు అధికారులు దరఖాస్తులు అందజేశారు.

రైతుల్లో తుపాను గుబులు



ఇప్పలపాడులో కల్లంలోనే ఉన్న ధాన్యం



ధాన్యాన్ని బస్తాలో పడుతున్న రైతులు

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలో తుపాను ప్రభావంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడిపోయింది. శుక్రవారం ఉదయం మబ్బులతోపాటు కొద్దిపాటి చినుకులు కూడా పడ్డాయి. మధ్యాహ్నానికి మళ్లీ ఆకాశం మేఘావృతం కావడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఆరుగాలం పండించిన వరి పంట చేతికి వచ్చే సమయంలో వర్షాలు పడి నీటి పాలైతే తమ పరిస్థితి ఏంటంటూ రైతులు వాపోతున్నారు. తుఫాను ప్రభావం ఎక్కువగా ఉంటుందని వర్షాలు అధికంగా కురిసే అవకాశం ఉందని వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో పంటను కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికే వరి కోసిన రైతులు ఆ పంటలను కళ్లాల్లో నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

అపార్ సమస్యలపై వినతి

కుక్కునూరు: జనన ధ్రువీకరణ పత్రాలు పారదర్శకంగా ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి బుయ్యన శ్రీను ప్రభుత్వాని డిమాండ్ చేశారు. విద్యార్థులు, తలిదండ్రులు అపార్‌లో ఎదుర్కొంటున్న సమస్యలపై శుక్రవారం తహసీల్దార్‌కు సీపీఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. విద్యార్థుల అపార్ నమోదులో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అపార్ రిజిస్ట్రేషన్‌కు అవసరమైన మార్పులు హెచ్ఎం లేదా తహసీల్దార్ డిక్లరేషన్ ఇస్తే మార్చే విధంగా మండలంలో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయాలని కోరారు.

విద్యుత్ కనెక్షన్ల మంజూరులో అవినీతి

ఏలూరు (టూటౌన్): వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరుకు కొన్నిచోట్ల రైతుల నుంచి అధికారులు, సిబ్బంది లంచాలు తీసుకోవడం దారుణమని, విద్యుత్ కనెక్షన్ల మంజూరులో అవినీతిపై సమగ్ర విచారణ చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కట్టా భాస్కరరావు, కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. వ్యవసాయ బోర్లకు విద్యుత్ కనెక్షన్ల సమస్యపై శుక్రవారం ఏలూరులో వారు మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు వెంటనే విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయాలని కోరారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు హోటల్ పారడైస్‌లో ఆహార పదార్థాల తయారీలో రంగులు కలుపుతున్నారని వచ్చిన సమాచారంతో శుక్రవారం విజిలెన్స్, లీగల్ మెట్రాలజీ, ఆహార పదార్థాల తనిఖీ అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంయుక్తంగా తనిఖీ చేశారు. హోటల్‌లోని ఫ్రిజ్‌లో రాత్రి వండిన పదార్థాలు గుర్తించారు. నమూనాలు సేకరించారు.

కంప్యూటర్ ఆపరేటర్లను నియమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామారావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉన్నత పాఠశాలల్లో కంప్యూటర్ విద్యను పునరుద్ధరించి, ఆపరేటర్లను నియమించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి రామారావు డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ ఏలూరు నగర శాఖ సమావేశం శుక్రవారం స్థానిక సుబ్బమ్మదేవి నగరపాలక ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన నగర అధ్యక్షుడు కురమా ఆనంద కుమార్ మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులకు పీఎఫ్ నెంబర్లను వీలైనంత త్వరగా కేటాయించాలని కోరారు. నగర ప్రధాన కార్యదర్శి అబ్బుదాసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ 2023 జూలై నుంచి పీఆర్‌సీ అమలు కావాల్సి ఉండగా, కూటమి ప్రభుత్వం నేటికీ అమలు చేయలేదని ఆందోళన వ్యక్తం చేశారు. మ్యానిఫెస్టోలో చేర్చిన విధంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఐఆర్ ప్రకటించాలన్నారు. సమావేశంలో ఏపీటీఎఫ్ నాయకులు కె.పొట్టియ్య, టి.ప్రకాష్, జె.శాంతికుమార్, కె.సూర్యప్రకాష్, కె.కుమార్, సీహెచ్ వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.